


www.aakshitha.com
People's voice
# అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
## తెలంగాణ దిక్సూచి
శనివారం | 01 | ఆగస్టు | 2026 | పేజీలు: 08




# ఫలించిన క్రీడాకారుల కల

**మారనున్న కల్వకుర్తి మినీ స్టేడియం రూపురేఖలు**

**1.30 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధికి నోచుకోని కల్వకుర్తి మినీ స్టేడియం**

**కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధితో క్రీడాకారుల కల నెరవేరనుంది...**

**కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్....**

**ఆగస్టు 3న స్టేడియం అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి...**



**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి :** కల్వకుర్తి ప్రాంత క్రీడాకారులకు ఎంతో కాలంగా ఉన్న కల నేడు తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా పాలనలో నెరవేర బోతోందని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారి సీతారాం నాయక్ తో కలిసి కల్వకుర్తి మినీ స్టేడియాన్ని మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ పదేళ్ల పాటు అభివృద్ధికి నోచుకోని కల్వకుర్తి మినీ స్టేడియం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరైన 1కోటి 30లక్షల నిధులతో త్వరలోనే ఆధునిక సౌకర్యాలతో కొత్త రూపు సంతరించుకోనుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్వకుర్తి మినీ స్టేడియం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని క్రీడాకారులకు కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడంతో యువత తమ ప్రతిభను నిరూపించు కునేందుకు తగిన వేదిక లేక ఇబ్బందులు పడ్డారని జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లా లంటే ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి సమస్యకు చరమగీతం పాడేందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచన ..మిగతా 2లో

# చదువుకుంటేనే ఉజ్వల భవిత

**నాణ్యతలో రాజీపడొద్దు**

**సౌకర్యాలపై ఆరా**

**మెరుగైన వైద్యం అందించాలి**

**జడ్చర్లలో గిరిజన మినీ గురుకుల పాఠశాల, ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ**

**కలెక్టర్ ఖుష్బూ గుప్తా**





**మహబూబ్‌నగర్, అక్షిత బ్యూరో:** జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం జడ్చర్ల మండల పర్యటనలో భాగంగా తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాల జడ్చర్లతో పాటు ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన మినీ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ముందుగా తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాల జడ్చర్లను సందర్శించిన కలెక్టర్, పాఠశాల సిబ్బంది హాజరు రిజిస్టర్, తరగతి గదులు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం నాలుగో ..మిగతా 2లో

# నీటి నిల్వలతో దోమల వ్యాప్తి




**కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** పురపాలికల్లో దోమల వ్యాప్తికి కారణమయ్యే నీటి నిల్వలను తొలగించాలని, డ్రైనేజీలు, కాలువలు, పరిసర ప్రాంతాలను ఎప్పటి కప్పుడు శుభ్రపరుస్తూ ప్రజలకు పరిశుభ్రమైన వాతా వరణం కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వనపర్తి పట్టణంలోని తెలుగువాడ ప్రాంతంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. వైద్య శాఖ సిబ్బంది ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో చేపడుతున్న పారిశుధ్య చర్యలు, పరిశుభ్రత కార్య క్రమాలను పరిశీలించిన కలెక్టర్ ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా ..మిగతా 2లో

# సివిల్ సర్వీస్ లక్ష్య సాధనకు కృషి చేయాలి

**యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్-2027 ఉచిత కోచింగ్‌ను బీసీ యువత సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**అర్హులైన ప్రతి బీసీ అభ్యర్థి గడువులోగా లాంగ్ టర్మ్ కోచింగ్ కు దరఖాస్తు చేసుకోవాలి**

**యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్--2027 ఉచిత లాగ్ టర్మ్ కోచింగ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లు కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ప్రభుత్వం ప్రతిభావంతులైన బీసీ యువతకు కల్పిస్తున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్--2027 ఉచిత కోచింగ్ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని అత్యున్నత సివిల్ సర్వీసుల లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపు ..మిగతా 2లో

## ఫలించిన క్రీడాకారుల కల



**మొదటి పేజీ తరువాయి...**

మేరకు కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 1 కోటి 30 లక్షల నిధులను మంజూరు చేసిందని ఈ నిధులతో స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్, ప్రహరీ గోడ నిర్మాణం, ఫ్లడ్ లైట్లు, డ్రెస్సింగ్ రూంలు, తాగునీటి సౌకర్యం,క్రీడా పరికరాల గది తదితర ఆధునిక సదుపాయాలు కల్పించనున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

**ఆగస్టు 3న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి పనులకు ఆగస్టు 3న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భూమి పూజ చేసి శంకుస్థాపన చేయనున్నట్లు కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ తెలిపారు.క్రీడల అభివృద్ధే లక్ష్యంగా కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి స్టేడియాన్ని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులను ఆదేశించారు.

**క్రీడాకారుల్లో ఆనందం**

కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి పనులకు నోచుకోవడంతో కల్వకుర్తి, చుట్టుపక్కల మండలాలకు చెందిన క్రీడాకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.కల్వకుర్తి మినీ స్టేడియంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు కల్వకుర్తి ప్రాంతం నుండి వెలువడే అవకాశం ఉందని యువత ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ వెంట మున్సిపాలిటీ కౌన్సిలర్లు షేక్ ఏజాస్, కొల్లోజు రాజేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్,ఏఈ సంతోష్ కుమార్,ఫుట్ బాల్ శిక్షకుడు వెంకటరాములు, గుత్తేదారు ప్రవీణ్ కుమార్, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్, నవీన్, సీనియర్ క్రీడాకారులు జహీర్, మహేష్ రెడ్డి, చెన్నకేశవులు, భాను, యువజన కాంగ్రెస్ నాయకులు అఖిల్,పడకంటి వెంకటేష్,దున్న సురేష్,నవీన్,తదితరులు ఉన్నారు.

## నీటి నిల్వలతో దోమల వ్యాప్తి




**మొదటి పేజీ తరువాయి...**

అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దోమల వ్యాప్తికి కారణమయ్యే నీటి నిల్వలను పూర్తిగా తొలగించాలని, డ్రైనేజీలు, కాలువలు, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. కాలనీలు, వీధుల్లో చెత్త పేరుకుపోకుండా సకాలంలో తొలగించి పారిశుద్ధ్య ప్రమాణాలను పాటించాలని అధికారులకు ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధులను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ మాధవి, స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, ఆరోగ్యశాఖ సిబ్బంది,, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చదువుకుంటేనే ఉజ్వల భవిత

**మొదటి పేజీ తరువాయి...**



తరగతి గదిలోకి వెళ్లి చిన్నారులతో మాట్లాడారు. వారికి ప్రతిరోజు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా, ఇతర సౌకర్యాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. పాఠశాలలో దోమల సమస్య తీవ్రంగా ఉందని, కొన్ని తరగతి గదుల కిటికీలకు తలుపులు కూడా లేవని అన్నారు. అలాగే కొన్ని తరగతి గదులలో ఫ్యాన్లు పనిచేయడం లేదని విద్యార్థులు కలెక్టర్ కు తెలిపారు.

దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, పనిచేయని ఫ్యాన్లను సాయంత్రంలోపు మరమ్మతు చేయాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. కిటికీల తలుపుల మరమ్మతులు వెంటనే చేపట్టేందుకు అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. అలాగే పాఠశాల ప్రహరీ గోడ దెబ్బతిన్నందున దాని నిర్మాణానికి, కిటికీల మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలను అత్యవసరంగా సిద్ధం చేసి అనుమతుల కోసం సాయంత్రంలోపు ఫైల్ పంపించాలని సంబంధిత ఆర్సీఓను ఆదేశించారు.

పాఠశాలలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో వెంటనే ఫాగింగ్ నిర్వహించి, దోమలను నిర్మూలించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జడ్చర్ల మండల కేంద్రంలోనీ ఏరియా ఆసుపత్రిని సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ప్రధాన కారిడార్, వార్డులు, క్యాజువాలిటీ, లేబర్ రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి భవనం వెలుపల కొన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయినట్లు గుర్తించిన కలెక్టర్, వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతిరోజూ కనీసం మూడు పర్యాయాలు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టి అన్ని విభాగాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. లేబర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, ప్రసూతి వార్డులో బాలింత మహిళలతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, శానిటేషన్, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వైద్య సేవల నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని ఆసుపత్రి అధికారులకు సూచించారు.

అనంతరం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి పాత బజార్‌లో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్ రావు, మున్సిపల్ కమిషనర్ ఎం.గిరీష్, ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ మహమ్మద్ అర్షదుల్ల, తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సర్వీస్ లక్ష్య సాధనకు కృషి చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**




నిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో టీజీ బీసీ స్టడీ సర్కిల్ ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్--2027 దీర్ఘకాలిక ఉచిత కోచింగ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు కరపత్రాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి పరిపాలనలో ప్రతిభావంతులైన యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ కోచింగ్‌ను అందిస్తూ బీసీ విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు.

గ్రామీణ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన యువత కూడా ఐఏఎస్ ఐపీఎస్ ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగేందుకు ఈ కోచింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 2026, ఆగస్టు 24 నుంచి 2027, మే నెల వరకు పూర్తిగా ఉచిత కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. నాణ్యమైన బోధనతో పాటు కోచింగ్ సామగ్రి, గ్రంథాలయ సదుపాయం, కరెంట్ అఫైర్స్ మెటీరియల్ అనుభవజ్ఞులైన అధ్యాపకుల శిక్షణ రెగ్యులర్ పరీక్షలు మాక్ టెస్టులు వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇంటర్వ్యూ మార్గదర్శకత్వం వంటి అన్ని సౌకర్యాలు ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా కల్పిస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వం కోచింగ్ కార్యక్రమానికి మొత్తం 150 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వీరిలో 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా మరో 50 మందిని ఇప్పటికే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

ఎంపికైన అభ్యర్థులకు స్టైపెండ్ అదనంగా ఒకేసారి పుస్తకాల గ్రాంట్ అందజేస్తామని అన్నారు. ఈ ఆర్థిక ప్రోత్సాహకాలు విద్యార్థులు పూర్తిస్థాయిలో పోటీ పరీక్షలపై దృష్టి కేంద్రీకరించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన విద్యార్థులకు కూడా ఈ సమాచారాన్ని చేరవేసేందుకు అధికారులు ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని యువత పట్టుదలతో శ్రమిస్తే అత్యున్నత లక్ష్యాలను తప్పకుండా చేరుకోగలరని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలని బీసీ ఎస్సి ఎస్టీ వర్గానికి చెందినవారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ 2026 ఆగస్టు 7 వరకు కొనసాగుతుందని ఆగస్టు 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ఆగస్టు 19న ఫలితాలు ఆగస్టు 21 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆగస్టు 24 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అర్హతలు ఎంపిక విధానం దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను టీజీ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధికారిణి జి. జ్యోతి డైరెక్టర్ బీసీ స్టడీ సర్కిల్ గోన శ్రీలత జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి మాధవి ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకట్ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు టీజీ బీసీ స్టడీ సర్కిల్ ప్రతినిధులు అధ్యాపకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఎస్ఎస్సీ పరీక్షల్లో విద్యార్థులు

# 100% పాస్ అయ్యే విధంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో వనపర్తి జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని ఉర్దూ మాధ్యమ పాఠశాలలో నిర్వహించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల (జీహెచ్ఎంలు) సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల పరీక్షల సన్నద్ధత, ప్రత్యేక బోధన కార్యక్రమాలు, ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణితం, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టులను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రూపొందించిన ప్రత్యేక అధ్యయన మెటీరియల్ (స్టడీ మెటీరియల్) వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆగస్టు 12వ తేదీలోగా సంబంధిత ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక స్టడీ మెటీరియల్ పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో ఆబ్జెక్టివ్ తరహా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆ పరీక్షల ఫలితాల ఆధారంగా సబ్జెక్టుల్లో వెనుకబడిన (స్లో లెర్నర్స్) విద్యార్థులను గుర్తించి వారి జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. గుర్తించిన విద్యార్థులకు ప్రత్యేక స్టడీ మెటీరియల్ ఆధారంగా మూడు నెలల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఆయా సబ్జెక్టుల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ బలహీనతలను అధిగమించేలా ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా, తరచూ పరీక్షలు నిర్వహిస్తూ వారి పురోగతిని అంచనా వేయాలని, అవసరమైన చోట అదనపు బోధన అందించాలని కలెక్టర్ తెలిపారు. వచ్చే ఎస్ఎస్సీ పరీక్షల్లో గణితం, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టుల్లో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై సమీక్షించిన కలెక్టర్, ప్రతి పాఠశాలలో గ్యాస్ కనెక్షన్లను తప్పనిసరిగా వినియోగించి పరిశుభ్రంగా, నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యా ప్రమాణాల పెంపుతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారం

### మరికల్‌లో ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం

### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్





**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభ కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మండలం మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండ్ల మంజూరైన లబ్ధిదారుల కుటుంబ సభ్యులను అభినందించిన మాజీ ఎంపీపీ, వారికి పట్టు వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సూర్య ప్రతాప్ గౌడ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసే ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రతి అర్హుడికి న్యాయం జరుగుతుంది. నాణ్యతతో ఇండ్లు నిర్మించుకుని సంతోషంగా జీవించాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా చూసే బాధ్యత తమదని, ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటామని సూర్య ప్రతాప్ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి సత్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహా, సింగిల్ విండో వైస్ చైర్మన్ మెరుగు రాజు, మాజీ ఎంపీపీ వరదరాజుల వెంకటేశ్వర్ రావు, జిల్లా గ్రంథాలయ మాజీ చెర్మన్ నాగపూరి విష్ణు, గ్రామ సర్పంచ్ కాకం రమేష్, ఉప సర్పంచ్ బాలమ్మ,వెన్నచర్ల గ్రామ మాజీ ఎంపీటీసీ డి రవికుమార్, మాజీ ఉప సర్పంచ్ మేకల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ నాయకులు ఎం ఇమామ్ గౌడ్, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ నాయకులు నరేంద్ర చారి,ఎండీ హబీబ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శాకాంబరి మాతగా శ్రీ అంబాభవాని అలంకరణ

### 101 రకాల పిండి వంటలతో అమ్మవారికి విశేష నైవేద్యం



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** కొత్తకోట పట్టణంలోని శ్రీ అంబాభవాని దేవాలయంలో ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారిని శాకాంబరి మాతగా రకరకాల కాయగూరలు , ఆకుకూరలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి 101 రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు మఠం సదాశివయ్య , మఠం ఆనందయ్య గార్లు ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించగా భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ఆశీస్సులు పొందారు. పూజల అనంతరం భక్తులకు అమ్మవారికి నైవేద్యంగా తెచ్చిన పిండి వంటలు తీర్థప్రసాదాలుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పొగాకు అనీల్ కుమార్ సోదరులు ఏర్పాట్లను పర్యవేక్షించగా మహిళా భక్తులు, పట్టణ ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# నక్కలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనానికి భూమిపూజ

### ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం, నక్కలపల్లి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా గ్రామ విద్యార్థులు ఎదురుచూస్తున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణానికి నేడు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఇచ్చిన హామీ మేరకు, పెద్దకొత్తపల్లి మండలం మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ చొరవతో అరబిందో ఫార్మా సంస్థ సామాజిక బాధ్యత సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ.20 లక్షల వ్యయంతో పాఠశాల భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మొదట గ్రామ సర్పంచ్ సంప్రదాయ పద్ధతిలో కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించగా, అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ కొబ్బరికాయ కొట్టి, గడ్డపారతో తొలి గుంత తవ్వి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించి, బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. నూతన పాఠశాల భవనం నిర్మాణానికి సహకరించిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి. సత్యం, మాజీ ఎంపీపీ వరదరాజుల వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మొట్టే కురుమయ్య , ఉపసర్పంచ్ కొత్త రవీందర్ రెడ్డి , మాజీ ఉపసర్పంచ్ మేకల మల్లేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు మొట్టే శేఖర్, ప్రధాన ఉపాధ్యాయురాలు శరణ్య, ఆదర్శ గ్రామ పాఠశాల చైర్మెన్ నీలం అల్లిమ్మ, వార్డు సభ్యులు దాసరి శ్రీశైల,పి శంకర్, బండి కమలమ్మ మహేష్,చిన్న నరసింహ, పెద్దలు ఈశ్వరయ్య, శేఖర్ దస్తగిరి,రామచంద్రయ్య, చిన్నయ్య గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పదోన్నతి పొందిన ఎస్.ఐ లు నర్సింగ రావు, అలీముద్దీన్ లకు ఎస్పీ అశోక్ కుమార్ శుభాకాంక్షలు



**జగిత్యాల అక్షితబ్యూరో:** గొల్లపల్లి, కోరుట్ల పోలీస్ స్టేషన్ లలో ఏఎస్ఐ లుగా విధులు నిర్వహించి ఎస్.ఐ లుగా పదోన్నతి పొందిన నర్సింగరావు, అలీముద్దీన్ లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఎస్ఐ హోదాకు సంబంధించిన స్టార్ చిహ్నాన్ని అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాకుండా బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని అన్నారు. పెరిగిన బాధ్యతలను క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం, గౌరవం మరింత పెరిగేలా విధులు నిర్వర్తించాలని సూచించారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## పచ్చదనమే భావితరాలకు వరం
## కొల్లాపూర్‌లో వనమహోత్సవం

**మున్సిపల్ చైర్మన్ రెడ్డి జ్యోతి సత్యం,**





**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ మండలం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు మేరకు గురువారం కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో భారీగా మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం, మున్సిపల్ కమిషనర్ శంకర్, సహచర కౌన్సిలర్లతో కలిసి మినీ స్టేడియం గ్రౌండ్, బాలికల ఉన్నత పాఠశాల, శివాలయం సమీపం, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి భావితరాలకు పచ్చని తెలంగాణను అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘన నివాళ్లు

**సంతాపం తెలిపిన మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి బిఆరెస్ పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ లో గుండెపోటుతో మృతి చెందడం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ బిఆర్ ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ లో బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ లీడర్ మన్నే గోవర్ధన్ రెడ్డి తో కలిసి పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా.. ఉద్యమ నాయకుడు సుదర్శన్ రెడ్డి అని కొనియాడారు. సుదర్శన్ పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తుండేవారు. బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అన్నారు. సుదర్శన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన నిఖార్సైన ఉద్యమకారుడు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. శోకసంద్రంలో మునిగిపోయిన వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రావుల విజయ్, నరసింహ, పాతాళ నరసింహ, నాగరాజు, రఘు మరియు తెలంగాణ ఉద్యమ కారులు బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## జనంపల్లి రెసిడెన్షియల్ స్కూల్, ఏరియా ఆసుపత్రిని
## ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

**విద్యార్థులకు నాణ్యమైన విద్య,**

**పరిశుభ్రమైన వసతి కల్పించాలి**

**అధికారులకు ఆదేశం**








**రామన్నపేట అక్షిత ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం జనంపల్లి గ్రామంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి విస్తృతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, వంటశాల, భోజనశాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. అలాగే విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, మౌలిక వసతులు, పారిశుద్ధ్య నిర్వహణపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. వసతి గృహాలు, పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖల ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనులు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించి, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి రామన్నపేట ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ ఆసుపత్రి హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, సిబ్బంది విధుల నిర్వహణపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, పంచాయతీరాజ్ ఏఈ ఆశిష్ రాఘవ, గృహనిర్మాణ శాఖ ఏఈ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, పంచాయతీ కార్యదర్శులు సైదిరెడ్డి, అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా
## పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలు

**జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్**



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని 01 ఆగస్టు 2026 నుండి 31 ఆగస్టు 2026 వరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్--30 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించరాదు. సెక్షన్--30 అమలులో ఉన్న కాలంలో సంబంధిత పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, బహిరంగ సభలు, సమావేశాలు లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదేవిధంగా, సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం, వదంతులు, మత విద్వేషాలు లేదా సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు, వీడియోలు, సందేశాలు ప్రసారం చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి పోలీసు శాఖకు సహకరించాలని, సభలు, సమావేశాలు లేదా ఇతర బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** బయ్యారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976-77 విద్యా సంవత్సరం లో పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని హైదరాబాదులోని క్రితుంగా రెస్టారెంట్లో నిన్న ఘనంగా నిర్వహించారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు ఒకే చోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ముఖ్యంగా మా క్లాస్మేట్ బుక్కా సత్యనారాయణ సాహిత్యంలో ప్రముఖ పాత్ర పోషిస్తూ రెండు తెలుగు రాష్ట్రాలలో సాహిత్య సేవలను కొనసాగిస్తున్న సందర్భంలో వారికి న్యూఢిల్లీలో డాక్టరేట్ ప్రధానం హైదరాబాదులో నంది అవార్డు ప్రధానం. వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా తెలంగాణ ఉద్యమకారుడిగా ఎన్నో సంఘాలకు సేవలు అందిస్తూ ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులచే పురస్కారాలు జాతీయ అంతర్జాతీయ పురస్కారాలు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు మాజీ గవర్నర్లు జిల్లా కలెక్టర్లు వివిధ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సుమారు 60 పురస్కారాలు అందుకున్న సందర్భంగా ఇంకనూ సామాజిక సేవలు అన్నదానాలు కరోనా సమయములో బాధితులకు సేవలు పేదవారికి తోచినంత సహాయం తోటి కవులకు పుస్తకాల ముద్రణలో సహాయ సహకారాలు ఎన్నో ఘనమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా వారిని దంపతులతో ఘనంగా ఈ ఆత్మీయ సమ్మేళనంలో సత్కరించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో బొందలపాటి రవికుమార్ జన్మదిన సందర్భంగా ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కొల్లా మన్మధరావు ఎర్ర నాగేశ్వరరావు మట్టి వెంకటేశ్వర్లు ఆర్ వీరభద్రం ఎండి యూసఫ్ యలమర్తి వెంకటేశ్వర్లు బుక్కా సత్యనారాయణ మొగిలిచర్ల వెంకటేశ్వర్లు జి వీరభద్రం వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఎన్ ప్రసాద్ ఎస్ వెంకటేశ్వరరావు కాజా రమణ తాటికొండ లీల ఎం పద్మప్రియ పద్మజ వాసిరెడ్డి సులోచన నున్న పావని పుట్టగుంట సత్యనారాయణ వేములపల్లి స్వరూప మా తర్వాత బ్యాచ్ పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కడెం ప్రాజెక్టును ఆకస్మికంగా సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం, ప్రస్తుత నీటి నిల్వ, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న రోజుల్లోనూ వర్షాలు కొనసాగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.

ప్రాజెక్టు దిగువ ప్రాంతాల గ్రామాల ప్రజలకు నీటి విడుదలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే అందించి అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రాజెక్టు అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ నీటి మట్టం, ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రాజెక్టు గేట్లు, నీటి ప్రవాహ ప్రాంతాలు, ఇతర ప్రమాదకర ప్రాంతాల్లోకి అనధికార వ్యక్తులు ఎవరూ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్ అవసరాలు, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టులో నీటి నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

అనంతరం ఖానాపూర్ పట్టణంలోని హైటెక్ సిటీ మైనారిటీ వసతి గృహానికి వెళ్లే మార్గంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారిని కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిత్యావసర వస్తువులు, అవసరమైన సామగ్రిని నిరంతరం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో ఖానాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక, నీటిపారుదల శాఖ అధికారులు జగదీష్, రాజేంద్ర ప్రసాద్, ప్రవీణ్ కుమార్, వీరన్న, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహశీల్దార్లు ఖాజా మొయినుద్దీన్, సుజాత, , ఎంపీడీఓ రాధా రాథోడ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బహుజన చిట్యాల ఐలమ్మ ఫౌండేషన్ తరపున బహుజనులకు అవార్డులు

**పోరాట స్ఫూర్తిని కొనసాగించేందుకు బహుజనులకు గుర్తింపు, భావితరాలకు స్ఫూర్తిని అందించేందుకు కృషి**

**రాష్ట్ర అధ్యక్షుడు రావుల సుదర్శన్**




**వరంగల్, అక్షిత బ్యూరో:** బహుజన పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తితో వారి జయంతి వర్ధంతిలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బహుజన వర్గాలు సన్నద్ధం కావాలని బహుజన చాకలి ఐలమ్మ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రావుల సుదర్శన్ కోరారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దొరలకు పెత్తందారులకు వ్యతిరేకంగా భూ పోరాటం చేసి లక్షలాది ఎకరాల భూమిని విముక్తి కలిగించి లబ్ధిదారులకు అందేలా కృషి చేసిన నిప్పు కనిక చిట్యాల ఐలమ్మ వర్ధంతి సెప్టెంబర్ 10 జయంతి సెప్టెంబర్ 26న ఘనంగా నిర్వహించడమే గాక గత 15 సంవత్సరాలుగా వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకు సాగుతున్న ఫౌండేషన్ తరపున ఈ సంవత్సరం నుండి బహుజన చాకలి ఐలమ్మ ఫౌండేషన్ నుండి బహుజన పోరాట యోధులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాలడుగుల సురేందర్ మాట్లాడుతూ వెట్టి చాకిరి విముక్తికి ఆత్మగౌరవ పోరాటానికి ప్రత్యేకగా నిలిచిన వీర యోధురాలు చిట్యాల ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి బహుజన పోరాటయోధుల సేవలు గుర్తించి వారిని సత్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మరుగున పడిన బహుజనుల చరిత్రను గుర్తించి వారి సేవలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ఫౌండేషన్ తరపున చేస్తున్న కృషి బహుజన పోరాటయోధులకు ఎంతగానో స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా దరఖాస్తులను రాష్ట్ర అధ్యక్షుడు రావుల సుదర్శన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాలడుగుల సురేందర్ లకు సెప్టెంబర్ 10వ తేదీ లోపు 93466 09446,

63029 29985 లకు అందేలా పంపించాలని దరఖాస్తులు పరిశీలించి వారికి సెప్టెంబర్ 26 చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా అవార్డులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు చీకటి వీరస్వామి,శ్రీనివాస్ యాదవ్, కక్కెర్ల హరి గౌడ్, నాగపురి సంతోష్,తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ నాట్యాంజలి జాతీయ నృత్య పోటీల్లో నారాయణ విద్యార్థినులకు ద్వితీయ స్థానం



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం-మమతా రోడ్‌లో గల నారాయణ పాఠశాల విద్యార్థినులు హైదరాబాద్‌లో నిర్వహించిన హైదరాబాద్ నాట్యాంజలి జాతీయ స్థాయి నృత్య పోటీలు-- 2026లో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీలను జూలై 25, 26 తేదీలలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతి నేషనల్ థియేటర్లో నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన దారా అక్షర గోకుల మరియు రాయబారపు యశ శ్రీ తమ అద్భుతమైన నృత్య ప్రదర్శనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

ఈ సందర్భంగా విజేత విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు దారా వంశీకృష్ణ శశికళ రాయబారపు శ్రీనివాసరావు అరుణ అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నారాయణ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు కళలు క్రీడలు ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారని పాఠశాల ప్రిన్సిపల్ జీ. నవీన్ కుమార్ తెలిపారు.

## దుర్వాసనతో కంపు కంపు.. బసవన్న కట్ట వద్ద ప్రజల అవస్థలు



**తాండూరు, అక్షిత ప్రతినిధి:** తాండూరు పట్టణంలోని వార్డ్ నెంబర్ 33లో ఉన్న బసవన్న కట్ట పరిసరాలు తీవ్ర దుర్వాసనతో ప్రజలకు నరకయాతనగా మారాయి. రోజూ పేరుకుపోతున్న చెత్త, వర్షపు నీరు నిల్వ ఉండటం తో ఆ ప్రాంత మంతా దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. స్థానికుల కథనం ప్రకారం, మున్సిపల్ అధికారులు మరియు స్థానిక ప్రజా ప్రతినిది నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని, ఆరో పిస్తున్నారు. బసవన్న కట్ట సమీపంలో కూరగాయల వ్యర్థాలు, ఇతర చెత్తను విచక్షణా రహితంగా వేయడం వల్ల దుర్వాసన రోజు రోజుకూ పెరుగు తోందని, తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండటంతో చెత్త కుళ్లిపోయి దుర్గంధం మరింత తీవ్రమైందని, తెలిపారు. ఈ దుర్వాసన కారణంగా ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవు తున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని, ఇళ్ల బయటకు రావడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలం కావడంతో దోమలు, ఈగలు అధికమై డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. బసవన్న కట్ట పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి, నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించడంతో పాటు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. అలాగే భవిష్యత్తులో ఇక్కడ చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకుని, ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని,స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## వనపర్తి పట్టణంలో నిర్మించిన టౌన్ హాల్ నందు పెండింగ్ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి అక్షిత ప్రతినిధి : వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్ యార్డులో నిర్మించిన టౌన్ హాల్‌ను నెల రోజుల్లో ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శు క్రవారం జిల్లా కలెక్టర్ పాత మార్కెట్ యార్డులోని టౌన్ హాల్‌ను సందర్శించి, ఇప్పటివరకు పూర్తయిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. టౌన్ హాల్‌లో సౌండ్ ప్రూఫింగ్ పనులను వచ్చే నెలలోగా పూర్తిచేయాలని, అలాగే భవనం పరిసరాల్లో పచ్చదనం అభివృద్ధి, శుభ్రత నిర్వహణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ఫర్నిచర్ కు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేసి, నెల రోజుల్లో టౌన్ హాల్‌ను పూర్తిస్థాయిలో ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. రాబోయే మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి టౌన్ హాల్ వేదిక కావాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో ఇప్పటికే పూర్తయిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పాత యూకో బ్యాంకు సమీపంలో, జిల్లా గ్రంథాలయ ఆవరణ పరిసరాల్లో నిర్మించిన డ్రైనేజీ పనులు, సూర్య చంద్ర పాఠశాల రోడ్డులో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను పరిశీలించి వాటి నాణ్యతను తనిఖీ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## వరి కంటే ఆరుతడి పంటలు మేలు

### మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి




వలిగొండ/అక్షిత న్యూస్: వరి పంట కంటే ఆరుతడి పంటలే మేలని వలిగొండ మం డల వ్యవసాయ అధి కారి అంజనీదేవి అన్నారు. శుక్రవారం రోజు న పులిగిల్ల రైతు వేదికలో ప్రస్తుత ఎలినినో వాతావరణ పరిణామాలు వ్యవసాయ రంగ ప్రత్యామ్నాయ మార్గాలపై రైతులకు అవగాహన కల్పించాము. ఎలినినో వాతావరణ ప్రభావంతో జూలై నెల నాటికి గత సంవత్సరంతో పోల్చితే తక్కువ వర్షపాతం నమోదు అయ్యిందని నేటికి లోటు వర్షపాతం ఉన్నందున వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకుమండల వ్యవసాయ అధికారి అంజనీ దేవి అవగాహన కల్పించారు. ఎలినినో ప్రభావం ఆగస్టు మరియు సెప్టెంబర్ మాసంలో తీవ్రంగా ఉంటుందని అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావటం మరియు వర్షాలు కూడా పడే అవకాశం లేదని వాతావరణ శాఖ వారి హెచ్చరికల నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉన్నందున వరి వేసే రైతులు ఆరు తడి పంటలు వేసుకోవాలని సూచించడం జరిగింది ఒక ఎకరా వరి పండించే నీటితో ఆరుతడి పంటలు 5- 6 ఎకరాలు పండించవచ్చని రైతులకు చెప్పారు.నీటి లభ్యత తక్కువ కారణంగా రైతులు వరి వేసి భవిష్యత్తులో నష్టపోవద్దని కందులు,పెసర్లు,నువ్వులు,ఉలవలు,మినుములు,
కూరగాయలు,ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపి అధిక లాభాలు పొందాలని అలాగే సేంద్రియ పద్ధతుల్లో తక్కువ పెట్టుబడితో పంటలను సాగు చేయాలని అవగాహన కల్పించారు.ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వేముల అనూష,సహకార సంఘం డైరెక్టర్ జక్క దామోదర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి క్రాంతి కుమార్, పంచాయతీ కార్యదర్శి సైదులు ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్, రైతులు జక్క రమణ రెడ్డి సత్తిరెడ్డి,పుల్లారెడ్డి, సత్తయ్య,తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

### పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశు భ్రత పై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్

### ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దేశాయిపేట, నెహ్రూ మెమోరియల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద





వరంగల్, అక్షిత బ్యూరో:వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శుక్రవారం దేశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, నెహ్రూ మెమోరియల్ స్కూల్ ని ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాలు, పరిశు భ్రత, భవన నిర్మాణ పనులను పరిశీలించారు.మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు చేరుకున్న కలెక్టర్ విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం పాత భవనం పునరుద్ధరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు, కాంపౌండ్ గేట్ నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పాటు ఆవరణ పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు పాఠశాల ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్, బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, ఇతర ప్రభుత్వ సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.అదే ప్రాంతంలోని పాత పాఠశాల భవనం పునరుద్ధరణ పనులను కూడా పరిశీలించిన కలెక్టర్,



పనుల పురోగతిపై జిల్లా విద్యాశాఖాధికారిని (డీఈఓ) అడిగి తెలుసుకున్నారు. రెనోవేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో

జిల్లా విద్యాశాఖాధికారి రంగయ్య నాయుడు,ఎ ఎం ఓ ఉండ్రాతి సుజన్ తేజ,వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ , ఇంజినీరింగ్ అధికారులు, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

### గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

### సరైన పత్రాలు లేని 39 ద్విచక్ర వాహనాలు గుర్తింపు.

### వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు.





రాజన్న సిరిసిల్ల, అక్షిత జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు శనివారం ఉదయం వేములవాడ డీఎస్పీ ఆధ్వర్యంలో కొనరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గ్రామం మరియు కమ్మరి పేట తండాలల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 39 ద్విచక్ర వాహనాలను గుర్తించి,



సంబంధిత యజమానులు అవసరమైన పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు అనుమానిత వ్యక్తులను తనిఖీ చేసి, వారి ప్రస్తుత కదలికలు, స్థితి గతులపై ఆరా తీశారు. ప్రజల రక్షణతో పాటు వారికి భద్రతాభావం కల్పించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా తమ ప్రాంతాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు.అలాగే స్వీయ రక్షణ కోసం కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. భద్రతా పరమైన అంశాల్లో మరియు నేరాల నియంత్రణ లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

కాలనీలలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.ఎవరైనా ప్రజా జీవనానికి భంగం కలిగించిన, చట్ట వ్యతిరేకమైన కార్య కలాపాలకు పాల్పడిన చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని డిఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చందుర్తి సర్కిల్ సి.ఐ రవీందర్, ఎస్.ఐ ప్రశాంత్ రెడ్డి, రమేష్, మోతిలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాచలం దగ్గర 43 అడుగులకు చేరిన గోదావరి



**భద్రాచలం అక్షిత న్యూస్:** భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది.. గురువారం అర్ధ రాత్రి వరకు 28 అడుగులు వద్ద ప్రవహించిన గోదావరి నీటిమట్టం శుక్రవారం ఉదయం 10 గంటలకు 43 అడుగులకు చేరింది. దీనితో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. రామాలయం ప్రాంతంలో స్నానా ఘట్టాల, కరకట్ట వరకు గోదావరి వరద నీరు చేరడంతో స్థానిక యువత ప్రేమికులు సెల్ఫీలు కోసం గోదావరి నది తీరానికి రాగా సెల్ఫీలు ఫొటోస్ దిగకుండా పోలీసులు వారిని నివారించారు..

సతీష్ ఘడ్ రాష్ట్రం, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తు న్న గోదావరి మధ్యాహ్నం వరకు 48 అడుగులకు చేరింది.. ఈ క్రమంలో రెండవ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు.. ఈ నేపథ్యంలో లోతట్టు ముప్పు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, ఆవుల నష్టం, జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ గజ ఈతగాండ్లను, పోలీసులను సైతం ఏర్పాటు చేశారు.. గోదావరి ముంపు ప్రాంతాల ప్రజలకు పునారవస కేంద్రాలతో తో పాటు సబ్ కలక్టర్ ఆఫీసు,ఐటిడిఏ కార్యాలయం యందు కంట్రోల్ రూమ్ లు, ఏర్పాటు చేశారు..ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు అలిగిన సంప్రదించాలని కలెక్టర్ సూచించారు..

## పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులను ఘనంగా సత్కరించిన సీపీ



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సుధీర్ఘ కాలం విధులు నిర్వహించి పదవి విరమణ చేస్తున్న పోలీసు అధికారులు ఎస్.ఐలు అలీం హుస్సేన్, సీతారాములు, ఏఆర్ ఏ ఎస్.ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ నర్సింగం లను వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ఈ సందర్బంగా పదవీ విరమణ పొందుతున్న పోలీస్ అధికారులు వారి కుటుంబ సభ్యులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ పోలీస్ అధికారులు తమ విధుల్లో రాణించడం ప్రధాన కారణం నిలిచే పోలీస్ అధికారుల తమ వంతు పూర్తి సహకారాన్ని అందించిన కుటుంబ సభ్యులకు ముందుగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రస్తుత రోజుల్లో పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారుల ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించడం ప్రశాంతమైన వాతావరణంలో విధులు నిర్వహించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందని. పదవి విరమణ చేసిన అధికారులు తప్పనిసరిగా ఏదో ఒక వ్యాపాకాన్ని ఎంచుకోవాలని, ఇకపై కుటుంబ సభ్యులతో సమయాన్ని వెచ్చిస్తూ, తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, అలాగే ఆరోగ్యకరమైన అలవాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆరోగ్యంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఆర్ఐ సతీష్, ఆర్.ఎస్.ఐ శ్రవణ్ తో పాటు పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, ఇతర పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నోముల అభిరామ్ జన్మదిన వేడుకలు

### ఆర్భాటాలకు దూరంగా.. విద్యార్థులకు పుస్తకాలు, చాక్లెట్లు పంపిణీ

### తాను చదివిన పాఠశాలలోనే తన కొడుకు పుట్టినరోజు వేడుకలు





**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** నేటి కాలంలో జన్మదిన వేడుకలను హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో ఆర్భాటంగా నిర్వహించడం సాధారణమైపోయిన తరుణంలో, ఓ విద్యార్థి తండ్రి తన కొడుకు పుట్టినరోజును తాను చదివిన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల మధ్య జరిపించడం ఆదర్శంగా నిలిచాడు. రామన్నపేట మండలం నీర్నెముల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం నకిరేకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు నోముల విష్ణు అన్న లింగస్వామి కుమారుడు అభిరామ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో అభిరామ్ కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నాడు.

ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు చాక్లెట్లు, నోట్‌బుక్స్, ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలను జరుపుకోవడంతో పాఠశాలలో ఆనందోత్సాహ వాతావరణం నెలకొంది. నోముల అభిరామ్ జన్మదినాన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల మధ్య జరుపుకొని విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేయడం అందరి ప్రశంసలను అందుకున్నారు. ప్రశంసించిన ఉపాధ్యాయులు, గ్రామస్థులు విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు కొనియాడారు. ఆర్భాటాలకు దూరంగా సమాజానికి ఉపయోగపడే విధంగా జన్మదినాన్ని నిర్వహించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యన్. రవి,ఉపాధ్యాయులు కె . శ్రీనివాస రెడ్డి, విఘ్నేశ్వరరాణి, కృపారాణి, లింగస్వామి, మాధవి, నవ్య, నవనీత. రవి, తల్లితండ్రులు నోముల జీవిత లింగస్వామి, బాబాయ్ విష్ణు, అన్నలు సాయి తేజ, నిఖిల్ తేజ విద్యార్థిని విద్యార్థులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## జపాన్‌కు డ్రైవర్ల శిక్షణపై భాగస్వామ్యం దిశగా అడుగులు

### బద్దెనపల్లి ఐటీడీఆర్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించిన జపాన్ ప్రతినిధులు



**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** జపాన్‌కు నైపుణ్యమైన భారతీయ ప్రొఫెషనల్ డ్రైవర్లను తీర్చిదిద్దే లక్ష్యంతో హనా విస్టా కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణలోని ఐటీడీఆర్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్య అవకాశాలను పరిశీలించేందుకు సంస్థ ప్రతినిధులు జూలై 31, 2026న రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి లో ఐటిడీఆర్ సైట్ విజిట్ నిర్వహించారు.ఇట్టి పర్యవేక్షణ సంస్థ సీఈఓ సయూరి మత్సునో తెలంగాణ ఐఏఎస్ అధికారి హరి ప్రసాద్‌కు ఆదేశానుసారం , పర్య వేక్షించారు. డ్రైవింగ్ శిక్షణ విధానం, మౌలిక సదుపాయాలు, శిక్షణ పరికరాలు, నిర్వహణ ప్రమాణాలు, మొత్తం శిక్షణ వాతావరణాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే, భారతీయ ప్రొఫెషనల్ డ్రైవర్లకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పరస్పర సహకారంపై చర్చించి, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ భాగస్వామ్యం అమల్లోకి వస్తే తెలంగాణ యువతకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇట్టి పర్యవేక్షణ లో జిల్లా రవాణాశాఖ అధికారి దేవునూరి శ్రీనివాస్ మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీధర్ ఐటీడీఆర్ ప్రిన్సిపాల్ దొరయ్ మురుగన్ పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిరోధం, సైబర్ నేరాలు, ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సు

### పాల్గొన్న కాజీపేట సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్యాంసుందర్






**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** కాజీపేట్ పట్టణం నేతాజీ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం రోజున మాదకద్రవ్యాల నిరోధం, సైబర్ నేరాలు, ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాజీపేట్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్యాంసుందర్ హాజరై మాట్లాడుతూ యువత తమ ఉజ్వలమైన భవిష్యత్తును డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. డ్రగ్స్ రవాణా, వినియోగం చట్టరీత్య నేరమని, దీనికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్లైన్ మోసాలు పెరుగుతున్నాయని, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలియని లింకులను క్లిక్ చేయకూడదని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు లేదా బ్యాంకు వివరాలు పంచుకోవద్దని అవగాహన కల్పించారు. కళాశాలలో ర్యాగింగ్ కు తావు లేదని, జూనియర్ విద్యార్థులను వేధింపులకు గురి చేస్తే చట్టపరంగా శిక్షలు ఉంటాయని తెలిపారు. సీనియర్లు జూనియర్లు ఒకరికొకరు కలిసికట్టుగా సహకరించుకోవాలని పిలుపునిచ్చారు.

www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు




**భద్రాచలం అక్షిత న్యూస్:** భద్రాచలంవద్ద గోదావరి వరద గంట గంటకు పెరుగుతున్నందున లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఐటిడి ప్రాజెక్టు అధికారి బి, రాహులు తెలియజేశారు.. తెలంగాణ వ్యాప్తంగా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తుందని కనక లోతట్టు ప్రాంతాల్లో నివాసం చేస్తున్న ప్రజల సౌకర్యార్థం ఐసిడిఏ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన చెప్పారు.. గిరిజన గ్రామాలలోని వరద ముంపునకు గురి అయ్యే గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదురవుతే వెంటనే ఐటిడిఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని, అలాగే గ్రామాలలోని వరదల ముంపు ప్రాంతమునకు సంబంధించిన ప్రజలు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం 7995268352, సబ్ కలెక్టర్ కార్యాలయం 08743-232444, 7981219425 వరదల కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేసి పరిష్కరించు కోవాలని ఆయన ఆయన సూచించారు..

# న్యూట్రి మిక్స్ యూనిట్ తనిఖీ నిర్వహించిన ఐటిడిఏ అధికారులు



**భద్రాచలం అక్షిత న్యూస్:** భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశాల మేరకు గురువారం భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దమ్మక్క జాయింట్ లియాబిలిటీ న్యూట్రి మిక్స్ యూనిట్ ను హెచ్. డేవిడ్ రాజ్, ఏపీఓ (జనరల్), ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్ పివిటిజి అధికారి గన్యా నాయక్ సంయుక్తంగా సందర్శించి వారు తయారు చేస్తున్న తృణధాన్యాల న్యూట్రి మిక్స్ ను పరిశీలించారు.

ఈ సందర్భంగా జొన్నలు రాగులు, మిలెటికి సంబంధించిన కందులు ఇతర తృణ ధాన్యాలతో తయారు చేస్తున్న న్యూట్రిమిక్స్ ఆహార పదార్థాలను పరిశీలించిన అనంతరం,న్యూట్రిమిక్స్ తయారు చేస్తున్న మహిళలకు సూచనలు ఇస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మిల్లెట్ న్యూట్రిమోక్స్ సంబంధించిన ఆహార పదార్థాలు తయారు చేసి నేరుగా భద్రగిరి మార్ట్ కు ఎక్కువ శాతం సరఫరా చెయ్యాలని సూచించారు. మహిళలందరూ కలిసికట్టుగా ఉండి నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ తృణ ధాన్యాలను ఎక్కువ శాతం కొనుగోలు చేసి మిల్లెట్ న్యూట్రి మిక్స్ తయారుచేసి సకాలంలో భద్రగిరి మార్ట్ అందించి న్యూట్రి మిక్స్ కేంద్రం బలోపేతానికి సమిష్టంగా కృషి చేయాలని కోరారు.

# విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలి

## అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**యాదాద్రి భువనగిరి/ అక్షిత బ్యూరో:** జనంపల్లి తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు.

రామన్నపేట మండలం జనంపల్లి గ్రామంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ , కళాశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలోని తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, వంటశాల, భోజనశాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు తదితరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, మౌలిక వసతులు, పారిశుద్ధ్య నిర్వహణపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని అదనపు కలెక్టర్ స్వయంగా



పరిశీలించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. వసతి గృహాలు,పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని అధికారులకుసూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి మెరుగైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్ ఏఈ, గృహనిర్మాణ శాఖ ఏఈలతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న పనుల పురోగతి, పెండింగ్ పనులు, ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం అదనపు కలెక్టర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని హాజరు రిజిస్టర్ను పరిశీలించి, విధులకు హాజరవుతున్న సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఏఈలు ఆశిష్ రాఘవ, సందీప్, సురేష్, పంచాయతీ కార్యదర్శులు సైదిరెడ్డి, అయ్యప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్





**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ అన్నారు.

శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను కౌన్సిలర్లు కుర్మిల్ల శ్రీను, పొనగంటి మేఘన శ్రీనివాస్, వేముల జ్యోతి శ్రీకాంత్తో కలిసి ఆయన సందర్శించారు. హాస్టల్ వంటగదిని పరిశీలించి విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులకు స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో కొన్ని ప్రాంతాల్లో లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించి సంబంధిత అధికారికి ఫోన్ చేసి వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.దీంతో అధికారులు తక్షణమే లైట్లు అమర్చి సమస్యను పరిష్కరించారు.

హాస్టల్ ఆవరణలో నీరు నిల్వ ఉండడాన్ని పరిశీలించిన వైస్ చైర్మన్, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నాణ్యమైన ఆహారంతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు..

# ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మండల ప్రజలు

## ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఏఎంసి చైర్ పర్సన్ తిరుపతమ్మ సుధీర్




**నడిగూడెం, అక్షిత న్యూస్:** నడిగూడెం మండలానికి కేటాయించిన బస్సు సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ కోరారు. కోదాడ డిపో నుండి నడిగూడెం మండలానికి బస్సు సౌకర్యం కల్పించడం పట్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపేందుకు నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మంత్రి ఉత్తమ్ దంపతుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా బస్సు సౌకర్యం కోసం ఎదురుచూసి ప్రజ ఇబ్బందులు పడ్డారు. ప్రజల ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి నడిగూడెం మండలానికి బస్సు సౌకర్యం కల్పించారని బస్సు సౌకర్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కోదాడ నుండి నడిగూడెం మీదుగా మోతే వరకు బస్సు సౌకర్యం ఉన్నట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని బస్సు వచ్చే గ్రామ ప్రజలు బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలన్నారు.బస్సు సౌకర్యం కల్పించడం పట్ల ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కి మండల ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం నడిగూడెం నుండి మోతే వరకు బస్సులో ప్రయాణం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు భూత్కూరి వెంకటరెడ్డి,వేల్పూల సోమయ్య, కంభంపాటి సరితా చైతన్య,ఉప సర్పంచ్ ఎలుగూరి నాగరాజు, వార్డు సభ్యులు దున్నా లింగయ్య, బాణాల సతీష్ కుమార్, కాసాని మాదవి గోపీనాథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాల నాగరాజ్,చిల్లంచర్ల సత్యనారాయణ,గుండు విజయరామారావు,పుట్ట చంద్రయ్య,పాతకోట్ల రాము,,షేక్ మౌలానా,యలక శ్రీనివాస్ రెడ్డి,పల్లపు గోపాల్, అక్రమ్,వీరాచారి, దుర్గా,నాగమణి తదితరులు పాల్గొన్నారు.